క్లుప్తంగా

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయండి

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ సంస్థ పురోభివృద్ధికి ఉద్యోగులు సమైక్యంగా కృషి చేయాలని ఆర్టీసీ జోనల్–2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకశ్వర రావు సూచించారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో సంస్థ అభివృద్ధిలో ప్రతిభచాటిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో అభివృద్ధి బాటలో నడవాలంటే ఉద్యోగులు సహకారం ముఖ్యమన్నారు. ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామన్నారు. ఏప్రిల్ నెలలో ప్రతిభ చూపిన ఆదర్శ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు మొత్తం 16మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందజేశారు. డిపో మేనేజర్ ఏ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గంగుల గోపి ఎన్టీఆర్ జిల్లా బహిష్కరణ



ఇబ్రహీంపట్నం: పశ్చిమ ఇబ్రహీంపట్నానికి చెందిన గంగుల గోపి అలియాస్ గోపిచంద్‌ని పోలీస్ కమిషనర్ టీకే రాణా మంగళవారం ఎన్టీఆర్ జిల్లా బహిష్కరణ చేశారు. 29 ఏళ్ల వయసు కలిగిన గంగుల గోపి గతంలో నేరాలు చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. బయటకు వచ్చిన తర్వాత కూడా అతనిలో మార్పు లేకుండా ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధి నుంచి నగర బహిష్కరణ చేసినట్లు ఒక ప్రకటనలో సీపీ వెల్లడించారు.

నేడు ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభం

చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, సొసైటీ కార్యాలయాలను బుధవారం 10 గంటలకు నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించనున్నారు. 11 గంటలకు చిన్నంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన సొసైటీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.

13న జాతీయ లోక్ అదాలత్

మైలవరం: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అనుబంధంతో మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13న మైలవరం జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని జడ్జి శైలజ మంగళవారం తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ పడేందుకు అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్, మనోవర్తి, ఎక్సైజ్ కేసులు పరిష్కరించుకోవచ్చని కక్షిదారులకు సూచించారు. దీని వలన కక్షిదారుల సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చన్నారు.

12 నుంచి హనుమజ్జయంతి

తిరువూరు: స్థానిక రాజుపేట వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 12 నుంచి హనుమజ్జయంతి కార్యక్రమాలు జరుగుతాయని భక్తబృందం తెలిపింది. 12న దీక్షాధారణ, పుణ్యాహవచన, కలశపూజ, 13న పంచామృతాలు పళ్లరసాలతో ఆంజనేయస్వామికి అభిషేకం, 108 కలశ స్నపనం, చందనాలంకరణ, 14న హనుమాన్ సహస్ర నామార్చన, 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, మన్యుసూక్త సహిత హనుమాన్ మూలమంత్ర హోమం, అన్నప్రసాద వితరణ, 15న హనుమత్ కల్యాణం, 16న సంకీర్తన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ఈకేవైసీ చేయించాలి

మైలవరం: విశ్రాంత ఉద్యోగులు తప్పని సరిగా ఈకేవైసీ చేయించాలని ఎన్టీఆర్ జిల్లా ట్రెజరీస్ అండ్ ఎకౌంట్స్ ఆఫీసర్ ఎమ్‌హెచ్ రెహమాన్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని మైలవరం సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని జిల్లా ట్రెజరీస్ అండ్ ఎకౌంట్స్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం సందర్శించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో మైలవరం సబ్ ట్రెజరీ అధికారులు మల్లేశ్వరరావు, సతీష్, అకౌంటెంట్ నరసింహారావు పాల్గొన్నారు.

విస్సన్నపేట: విశ్రాంత ఉద్యోగులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా ట్రెజరీస్ అండ్ ఎకౌంట్స్ ఆఫీసర్ ఎంహెచ్ రహమాన్ అన్నారు. స్థానిక సబ్‌ట్రెజరీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. కార్యాలయంలో నిర్వహిస్తున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని పరిశీలించారు.

ఆర్బీకేల్లో సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు

ఇబ్రహీంపట్నం: మండలం పరిధి గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి డి.శైలజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ, పిల్లిపెసర విత్తనాలు 50 శాతం సబ్సిడీతో లభిస్తాయని పేర్కొన్నారు. ఎనిమిది కిలోల పిల్లిపెసర ధర రూ.388 కాగా, 10 కిలోల జీలుగ ధర రూ.395కు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీ ధరతో తీసుకుని ఖరీఫ్ సీజన్‌కు ముందు వ్యవసాయ భూముల్లో వెదజల్లి భూమి సారవంతం చేసుకోవాలని పేర్కొన్నారు.

రెన్యువల్ చేయించుకోవాలి

విస్సన్నపేట: ఎరువులు, విత్తనాలు, పురుగుమందు విక్రయాల డీలర్లు కాలపరిమితి పూర్తయిన లైసెన్సులు రెన్యువల్ చేయించుకోవాలని ఏఓ రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక ఏఓ కార్యాలయంలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాల డీలర్ల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఖరీఫ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయు కంపెనీల ఫామ్‌లను ముందుగానే లైసెన్సులకు జతపరచాలని పేర్కొన్నారు.

కొండంత అండ

- మేడూరులో 12 నుంచి 14వ తేదీ వరకు హనుమజ్జయంతి
- పాండవుల కాలంనాటి విగ్రహంగా పేరు ప్రఖ్యాతి



మేడూరు శ్రీవీరాంజనేయస్వామి

మేడూరు(గంపలగూడెం): స్వామిని దర్శించిన చాలు కొండంత అండ, ధైర్యం చేకూరుతాయని ఇక్కడకు విచ్చేసే భక్తుల విశ్వాసం. గుట్టను ఆనుకొని వెలసిల్లిన స్వామి ఎంతో పూర్వ చరిత్ర కల్గి, మహిమాన్వితం అని భక్తుల వేనోళ్ల కొనియాడుతుంటారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం మేడూరులో విరాజిల్లుతున్న శ్రీవీరాంజనేయస్వామి 15 అడుగుల నిలువెత్తు విగ్రహం ఉమ్మడి కృష్ణా జిల్లా, తెలంగాణా రాష్ట్రం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఎంతో విశిష్టతను సంతరించుకొంది. సాదారణంగా ఆలయాల్లో స్వామి ముఖం ఉత్తర ముఖంతో ఉంటాయి. ఇక్కడ మాత్రం స్వామి విగ్రహం దక్షిణ ముఖంతో ప్రత్యేకంగా ఉంటుంది. స్వామి విగ్రహం పాండవుల కాలంనాటిదిగా పెద్దలు, యోగిపుంగవులు చెబుతుంటారు. పూర్వకాలం పూర్తిగా అటవీప్రాంతంగా ఉండే ఇక్కడ పాండవులు సంచరించిన సమయంలో స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారని భక్తుల విశ్వాసం. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న విగ్రహాన్ని దీర్ఘకాలం క్రితం ఇక్కడ సమీపంలోని తెలంగాణా ప్రాంతానికి చెందిన మాటూరు గ్రామస్తులు తరలించేందుకు చేసిన ప్రయత్నం విఫలం అయ్యిందని చరిత్ర. ఆ గ్రామస్తులు స్వామి విగ్రహం కోసం ఎడ్లబండ్లపైన గడ్డపలుగులు, పారతో వచ్చి విగ్రహాన్ని పెకిలించే ప్రయత్నానికి పాల్పడ్డారు. ఆ సమయంలో ఆ వ్యక్తులకు తెలియని శక్తి ఆవహించి వారి గ్రామం తగలబడిపోతుందని తెల్సుకున్నారు. వెళ్లి చూడగా గ్రామంలోని పూరిళ్లు, వరిగడ్డివాములు కాలిపోతున్నాయి. దీంతో వారు ప్రయత్నాన్ని విడనాడారు. కాగా ఆ వ్యక్తులు స్వామి విగ్రహాన్ని తొలగించే ప్రయత్నంలో ఉండగా ఐదు అడుగులు ఉన్న విగ్రహం కాస్త పెరిగిపోతూ ఉంది. దీంతో కొందరు పైభాగంలో మేకులు కొట్టినట్లు చరిత్ర. ఇప్పటికీ విగ్రహం పైన మేకులు కొట్టిన ఆనవాళ్లు ఉన్నట్లు అర్చకులు తెలిపారు. గుట్టపైన ఉన్న పాదం ముద్ర స్వామిదిగా ఈ ప్రాంతవాసులు చెబుతుంటారు.

విగ్రహం ప్రత్యేకత

15 అడుగుల ఎత్తుఉన్న వీరాంజనేయస్వామి విగ్రహం అభయ హస్తంతో భక్తులకు ఎంతో విశ్వాసాన్ని కల్పిస్తుంది. విగ్రహం ఎగువభాగంలో స్వామి శిఖరం పక్కన శంఖు, చక్రాలు, కూర్మం ఉంటుంది. పాదాల వద్ద మత్స్యం ఉండటం ఇక్కడ ప్రత్యేకత. స్వామిని ఒక్కసారి దర్శించినచాలు దీర్ఘకాలంగా ఉన్న భయాలు పోగొడతారని భక్తులు విశ్వసిస్తుంటారు. ప్రతి మంగళ, శనివారం స్వామి ని అధిక సంఖ్యలో దర్శించుకుంటారు. ఏడాదిలో వైశాఖ మాసంలో స్వామి జయంతి, మార్గశిర మాసంలో సప్తాహాలు ఘనంగా నిర్వహిస్తారు.

12 నుంచి మూడు రోజులు జయంతి

ఈ నెల 12వ తేదీ నుంచి మూడు రోజులపాటు స్వామి జయంతిని నిర్వహించేందుకు పాలకవర్గ సభ్యులు, అధికారులు తగిన ఏర్పాట్లు గావిస్తున్నారు. విఘ్నేశ్వర పూజతో ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ అర్చకులు కోమండూరి ఆంజనేయాచార్యులు ప్రారంభిస్తారు. ప్రతి రోజు 108 బిందెల పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తారు. 14వ తేదీన తమలపాకులతో అర్చన గావిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రామకృష్ణ, ఈఓ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. మూడు రోజులు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహిస్తామన్నారు. స్వామి జయంతి సందర్భంగా మూడు రోజులు కోలాట భజన పోటీ నిర్వహిస్తారు. కాగా 14వ తేదీన గంపలగూడెం రామాలయం నుంచి మేడూరు గుడి వరకు శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రక్షణనిధి



జీళ్లకుంటలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: రాజకీయాలకతీతంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని జీళ్లకుంట గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని లబ్ధి చేకూరిన కరపత్రాలను పంపిణీ చేశారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కాలనీ గృహాలు మంజూరు చేయాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ గ్రామంలో పలు రకాల ప్రభుత్వ పథకాలు 342 కుటుంబాలకు రూ.5.43 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. ఈ గ్రామం నుంచి వల్లంపట్ల గ్రామానికి వెళ్లేందుకు వాగుపై వంతెన ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కాలనీ గృహాలు అవసరమైన వారికి వెంటనే మంజూరు చేయించాలని, అలానే విద్యుత్ స్తంభాలను అవసరమైన చోట్ల ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వల్ల ప్రతి గడపకు వెళ్లడంతో వారి సమస్యలు తెలుస్తున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించేందుకు మండల స్థాయి అధికారులు అందరూ ఉండటంతో సమస్యలు వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ధారావతు బద్దు, కే శ్రీను, ఎంపీటీసీ సభ్యులు ఏ నర్సారెడ్డి, కోట పుల్లారావు, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, పీఏసీఎస్ చైర్మన్ తుమ్మూరు వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ ఎస్ రామకృష్ణ, టి. ప్రసాదరావు, ఎం. రవికుమార్, ఎంపీడీఓ నాగేశ్వరరావు, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'

ముసునూరు: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే జగనన్నకు చెబుదాం కార్యక్రమం రూపొందించబడిందని, ప్రజలందరూ వినియోగించుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు డా. వరికూటి ప్రతాప్ పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో రాష్ట్రంలో మరో విప్లవాత్మక ప్రగతికి అడుగులు పడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, నాయకుడు సుబ్బారావు పాల్గొన్నారు.

ఆంజనేయపురంలో..

ఆంజనేయపురం(తిరువూరురూరల్): జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు మండలం ఆంజనేయపురం సర్పంచ్ మామిడి కుటుంబరావు కోరారు. గ్రామ సచివాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం మార్గదర్శకాలపై గ్రామస్తులకు మంగళవారం అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి రాయల రమేష్ పాల్గొన్నారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం 'పేరుతో టోల్‌ఫ్రీ నంబరు 1902ను విడుదల చేసిందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపత మ్మ అన్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళవా రం ఉదయం స్థానిక కమ్యూనిటీ హాలులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రొజెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని అధికారులు, ప్రజలు వీక్షించారు.

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని వీక్షించిన అధికారులు

నూజివీడు: సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి వ్యక్తిగత స్థాయిలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మంగళవారం ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు వీక్షించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎల్.అలీఖాన్, ఈవోపీఆర్డీ టీ సరస్వతి, ఏసీ దయాల రాజశేఖర్‌లతో పాటు ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొని ఆద్యంతం కార్యక్రమ ని ర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీ ఓ మాట్లాడుతూ ఎవరికైనా సమస్య ఉంటే 1902కు కాల్ చేసి ప్రతినిధితో సమస్యను చెప్పాలన్నారు. అప్పుడు ఫిర్యాదును నమోదు చేసుకుని, దానిని పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

'జగనన్నకు చెబుదాం'ను సద్వినియోగం చేసుకోవాలి

ఆగిరిపల్లి: మండలంలోని ప్రజలు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.వాణి అన్నారు. మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో ఎంపీడీఓ, కార్యాలయం సూపరింటెండెంట్ అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు సేవలు అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పాలడుగు జోత్స్న అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం నుంచి మంగళవారం ప్రారంభించిన కార్యక్రమాన్ని స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీపీ జోత్స్న, ఎంపీడీఓ రామకృష్ణనాయక్, ఉద్యోగులు వీక్షించారు.

మైలవరం: ప్రజా ఫిర్యాదులు సమర్థవంతంగా పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభించినట్లు ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి తెలిపారు. మైలవరం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీడీఓ లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో ఎంపీపీ ప్రసన్నరాణిస్వామి అధ్యక్షతన జగనన్నకు చెబుదాం కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.తిరుపతిరావు, వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు షేక్ కరీమ్, ఇస్లావత్ స్వామి, సత్యనారాయణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వీ సుధాకర్, తోలుకోడు ఎంపీటీసీ సభ్యుడు రామారావు

ఉపాధి కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

మొర్సుమల్లి(మైలవరం): ఉపాధి హామీ కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉపాధి హామీ పథకం ప్రాజక్టు డైరెక్టర్ జే సునీత తెలిపారు. మైలవరం మండలం మొర్సుమల్లిలోని కురివిడి చెరువులో ఉపాధి హామీ పథకంలో భాగంగా అమృత్ సరోవర్ ట్యాంక్ పనులను పీడీ సునీత మంగళవారం పరిశీలించారు. ప్రాజక్టు డైరెక్టర్ సునీత మాట్లాడుతూ ఉపాధి కూలీలకు తాగునీరు, ఫస్ట్‌ఎయిడ్ కిట్‌లు అందుబాటులో ఉండాలని, కూలీలు కొద్ది సేపు విరామం తీసుకునేందుకు టెంట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ నాయకుడు మాడపాటి శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రాజక్టు డైరెక్టర్ ఇంచార్జి వీరమల్లు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హీల్ అంధుల పాఠశాలకు వినికిడి యంత్రాల వితరణ

ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్‌లోని అంధుల పాఠశాలకు విద్యార్థుల సౌకర్యార్థం వినికిడి యంత్రాలైన బ్లూటూత్, ఎంపీత్రీ ప్లేయర్‌ను దాత కోల్ ఇండియా లిమిటెడ్ విశ్రాంత జనరల్ మేనేజర్ శివరాత్రి చంద్రహౌళి వితరణగా మంగళవారం అందజేశారు. అంధ పాఠశాల ప్రతినిధి ఎస్.రుష్మంత్ మాట్లాడుతూ ఈ వినికిడి యాంత్రాల ద్వారా అంధ విద్యార్థులకు పాఠాలు బోధించడం సులభతరం అవుతుందన్నారు. హీల్ కార్యదర్శి టి.లక్ష్మీ, ఫెసిలిటీస్ డైరెక్టర్ భాస్కర్, సీఈఓ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యావ్యాప్తికి ఉపాధ్యాయులు కృషి

పెనుగొలను(గంపలగూడెం): విద్యావ్యాప్తికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల విజయవంతానికి ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో పనిచేయాల్సి ఉందని ఎంఈఓ బి.సోమశేఖర్‌నాయక్ తెలిపారు. గంపలగూడెం మండలం పెనుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులతో వేసవిలో అమలు చేయాల్సిన కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో బడికిరాని పిల్లలను గుర్తించి చేర్పించాలన్నారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి ఎం.వెంకటలక్ష్మి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రేవు శైలజ, హైస్కూళ్ల హెచ్‌ఎంలు చంద్రం, జమలయ్య, సుధాకర్, రామచంద్రరావు, శేషం రాజు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం నాగరాజు పాల్గొన్నారు.

హింసా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న బీజేపీ

మైలవరం: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ హింసా రాజకీయాలు ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ ఆందోళన వ్యక్తం చేశారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై హత్యా ప్రయత్నాన్ని ఖండిస్తూ పార్టీ ఏపీ అధ్యక్షుడు రుద్రరాజు ఆదేశానుసారం మైలవరం ఎస్సై హరిప్రసాద్‌కు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, కర్నాటక సీఎం బసవరాజు బొమ్మై, ఎమ్మెల్యే అభ్యర్థి రాథోడ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

సొసైటీలను సందర్శించిన ఆంజనేయులు

రెడ్డిగూడెం: పాడి రైతు సంక్షేమం, మనమతం–అలుపెరగని సేవ మన అభిమతం అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుదప, ఓబులాపురం గ్రామాల్లోని మహిళా సొసైటీలను కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ తలసాని ఆంజనేయులు మంగళవారం సందర్శించారు. మైలవరం క్లస్టర్ మేనేజర్ తుమ్మల యశ్వంత్, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా అతిపెద్ద నేరం

రెడ్డిగూడెం: ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ద్వారా వైఎస్సార్ క్రాంతి పథకం డీఆర్‌డీఏ సహకారంతో మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మనుషుల అక్రమ రవాణా నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం బి. శ్రీనివాస్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ప్రపంచం లోనే అతి పెద్ద నేరమని, రోజూ ఎందరో అమ్మాయిలు, మహిళలు దీనికి బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా నేర్చుకున్న అంశాలను సమాజంలో అమలు చేయాలని, ప్రతి గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి ప్రజలను అప్రమత్తం చేయడానికి మా సహకారం ఉంటుందని తెలిపారు. ప్రజ్వల సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామ్ మాట్లాడుతూ ఐసీడీఎస్, పోలీస్, విద్యాశాఖల సమన్వయంతో ఇప్పటి వరకు 26,500 మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించామన్నారు. ప్రజ్వల సంస్థ ప్రతినిధులు సురేష్‌కుమార్, జె.వినోద్ పాల్గొన్నారు.

వ్యర్థాలను రోడ్ల వెంట పడవేయవద్దు

గంపలగూడెం: కొబ్బరిబోండాలు, అరటి, మామిడి పంట్ల దుకాణాలవారు వ్యర్థాలను గ్రామాల్లో రహదారుల వెంట, ఖాళీ స్థలాల్లో పడవేయరాదని ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. తోటమూల సమీపంలోని కట్టలేరు వద్ద రహదారి వెంట కుళ్లిపోయిన మామిడి కాయలను పడవేయడంతో సిబ్బంది మంగళవారం తొలగించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వ్యాపారులు, గృహస్తులు రోజూ చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ఈఓపీఆర్డీ బాబురావు, ఈఓ శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. విద్యార్థులతో పలు విజ్ఞాన పుస్తకాలతో పాటు కథల పుస్తకాలు చదివించారు. అనంతరం పలువురు విద్యార్థులతో కథలు చెప్పించారు. అలాగే క్యారమ్స్, చెస్ వంటి ఆటలు నేర్పించారు. రోజూ ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు గ్రంథాలయానికి విద్యార్థులు వచ్చి పుస్తకాలు చదువుకోవాలని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

గొల్లపల్లిలో..

మండలంలోని గొల్లపల్లి గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించారు. పుస్తక పఠనం వల్ల కలిగే ఉపయోగాలను హైస్కూల్ ఉపాధ్యాయులు ఏ నాగిరెడ్డి విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు, హైస్కూల్ పీడీ రవీంద్ర పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని చనుబండ, చాట్రాయి గ్రంథాలయాల ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారుల శ్రీకాంత్, మణికంఠ పాల్గొన్నారు.

పెనుగొలనులో..

పెనుగొలను(గంపలగూడెం): వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గంపలగూడెం మండలం పెనుగొలనుశాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. బాలబాలికలతో కథలు చదివించారు. 30 మంది బాలబాలికలకు నవోదయ, సైనిక్ స్కూళ్లలో ప్రవేశ పరీక్షలకు ఉపయోగపడేలా విధంగా రీజనింగ్‌లో మెలకువలను ఉపాధ్యాయుడు టి నాగరాజు తెలిపారు. గ్రంథాలయ నిర్వహణ అధికారి వి.జ్యోతిర్మయి పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్

నూజివీడు: వైఎస్సార్ సీపీని నియోజకవర్గంలో మరింత బలోపేతం చేసేందుకు పార్టీ అనుబంధ విభాగాల నాయకులు తమ వంతు కృషి చేయాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అన్నారు. అనుబంధ విభాగాలకు సంబంధించిన జిల్లా కార్యవర్గాల్లోని నాయకులతో పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మంగళవారం ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన, రైతు, వాణిజ్య, బీసీ, సేవాదళం, ఎస్సీ, మహిళా, క్రిస్టియన్ మైనారిటీ, ముస్లిం మైనారిటీ తదితర అనుబంధ సంఘాల నాయకులందరూ పార్టీకి వెన్నెముక వంటి వారన్నారు. ఎన్నికలు ఇంకా ఏడాది మాత్రమే ఉన్నందున తమ పరిధిలోని గ్రామాల్లో, మండలాల్లో పార్టీ పటిష్టానికి కృషి చేసి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని రచ్చబండల వద్ద, హోటళ్ల వద్ద, నలుగురు ఎక్కడ ఉంటే అక్కడ విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, ఆగిరిపల్లి, ముసునూరు జెడ్పీటీసీ సభ్యులు పిన్నిబోయిన వీరబాబు, వరికూటి ప్రతాప్, ఎంపీపీలు ఆరేపల్లి శిరీష, గోళ్ల అనూష, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల, ముసునూరు, చాట్రాయి మండలాల అధ్యక్షుడు శీలం రాము, పోలిమెట్ల శివ, మూల్పూరి నాగవల్లేశ్వరరావు, మిద్దే బాలకృష్ణ పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే రక్షణనిధి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మెగా జాబ్‌మేళాలు నిర్వహిస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. ఈ నెల 19న తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆయన ఏకొండూరు మండలం జీళ్లకుంటలో మంగళవారం ఆవిష్కరించారు. 10వ తరగతి నుంచి ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి కల్పించేందుకు ఈ మేళాలు ఉపయోగపడతాయన్నారు. తిరువూరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు బహుళజాతి సంస్థల్లో టెక్నికల్, నాన్ టెక్నికల్ పోస్టుల భర్తీకి ఈ మేళా జరుగుతోందన్నారు. రిజిస్ట్రేషన్ తదితర వివరాలకు 90326 33548, 89199 51682లో సంప్రదించాలని ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి నరేష్‌కుమార్ సూచించారు.

ప్రతి కుటుంబ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పారావు

నూజివీడు: రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని 32వ వార్డులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రతి పథకం చారిత్రాత్మకమేనని అన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో కూడా గెలిపించుకోవాలన్నారు. చంద్రబాబు మాటలు నమ్మితే ఇప్పుడు అమలవుతున్న పథకాలేవీ ఉండబోవన్నారు. టీడీపీ వాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కమిషనర్ సయ్యద్ అబ్దుల్‌రషీద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, కౌన్సిలర్లు నాగమల్లేశ్వరరావు, మారు అప్పాజీ, నాయకులు నాగేశ్వరరావు, జమలయ్య పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి



న్యాయవాదులనుద్దేశించి మాట్లాడుతున్న నూజివీడు 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ

నూజివీడు: ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా న్యాయవాదులు కృషి చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఏ నాగశైలజ అన్నారు. స్థానిక కోర్టు భవనాల ఆవరణలో బార్ అసోసియేషన్ హాల్‌లో మంగళవారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఇరుపక్షాల కక్షిదారులతో మాట్లాడి రాజీమార్గంలో తమ కేసులను పరిష్కరించుకుంటే మేలనే సందేశాన్ని వారికి తెలియజేయాలన్నారు. దీనివల్ల కక్షిదారులకు సమయం, నగదు ఆదా కావడమే కాకుండా న్యాయస్థానాలపైన ఉన్న కేసుల భారం కూడా తగ్గుతుందన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ ఎల్ శ్రీనివాసరావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కే హరికృష్ణ, స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుపల్లి సత్యప్రకాష్ పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం

చాట్రాయి: సహకార సంఘాలను బలోపేతం చేయడానికి ఉద్యోగులు కృషి చేయాలని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి సూచించారు. మంగళవారం గుంటూరులో సహకార సంఘాల కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమలో ఆయన మాట్లాడారు. సంఘాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, రుణాలు అందిస్తూ ఆర్థికంగా బలోపేతం చేయలాని ఆయన కోరారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం

మైలవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు అండగా ఉంటున్నారని మైలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం మార్కెట్ యార్డులో స్థానిక ఎమ్మెల్యే వసంత ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అన్నదాతలు కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలలో అమ్ముకుని, మద్దతు ధర పొందాలన్నారు.